



కాకినాడ చేరుకున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షకు హాజరు

- 7లో

వైసీపీ గుండాగిరీ

పెదపూడిలో జనసేన ప్రచార వాహనంపై జులుం

- 7లో

ఓదార్చి.. అభయమిచ్చి..

- చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మరణించిన టీడీపీ అభిమానుల కుటుంబాలకు భువనేశ్వరి ఓదార్పు
- అధైర్యపడొద్దని అండగా ఉంటామంటూ భరోసా
- పార్టీ కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులని గుర్తుచేసిన భువనేశ్వరి
- వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ
- జగ్గంపేట, పెద్దాపురం, తుని, కాకినాడలలో నాలుగు కుటుంబాలకు పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేత
- నిజం గెలవాలి కార్యక్రమానికి వచ్చిన భువనేశ్వరికి మహిళల సంఘీభావం

తమ కుటుంబం కష్టంలో ఉన్నప్పుడు ఆవేదనతో చలించిన ప్రతి కుటుంబానికి రుణపడి ఉన్నామని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిజం గెలవాలి మూడు రోజుల పర్యటనలో భాగంగా భువనేశ్వరి బుధవారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. స్కిల్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మృతి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి ఓదార్చారు. ఇంటిపెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు తమ కుటుంబం సభ్యులు వంటివారని, అలాంటి కుటుంబాలు ఆవేదనలో ఉంటే ఓదార్చడం తమ బాధ్యత అని వివరించారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలని కోరారు. తొలిరోజు కాకినాడ జిల్లా పర్యటన ముగించుకున్న భువనేశ్వరి బుధవారం రాత్రి బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేరుకున్నారు.



కాకినాడలో సత్యవతి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి



ఎర్రకోనేరులో బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు ఇస్తున్న దృశ్యం

కాకినాడలో సత్యవతి కుటుంబాన్ని ఓదార్చిన భువనేశ్వరి

కాకినాడ సిటీ, జనవరి 24: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై మరణించిన నగర తెలుగు మహిళాధ్యక్షురాలు చిక్కాల సత్యవతి కుటుంబాన్ని నిజం గెలవాలి.. కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో సత్యవతి నివాసానికి విచ్చేసి కుటుంబసభ్యులను ఓదార్చారు. భువనేశ్వరిని చూసి ఆమె కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సత్యవతి కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.3 లక్షల చెక్కు ఆర్థిక సాయంగా భువనేశ్వరి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మాజీ మేయర్ సుంకర పావని, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నేతలు పేరాబత్తుల రాజశేఖర్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, ఎంఏ తాజుద్దీన్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, వాసిరెడ్డి చిట్టిబాబు, ఎండీ అన్సర్, తుమ్మల సునీత, మల్లిపూడి నాగదీపిక, గుజ్జు దుర్గ పాల్గొన్నారు.

తునిలో నూకరాజు కుటుంబానికి పరామర్శ

తుని రూరల్, జనవరి24: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనస్తాపంతో మృతి చెందిన ఎర్రకోనేరు గ్రామానికి చెందిన ఇసరపు నూకరాజు కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. ఆమె తేటగుంట శివారు ఎర్రకోనేరుకు చేరుకుని మృతి చెందిన నూకరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆ కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయంగా చెక్కును అందజేశారు. ఆమె వెంట టీడీపీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, జ్యోతుల నవీన్, ఎస్వీఎస్ వర్మ, యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, మోతుక్కూరి వెంకటేష్, బిక్కిన శ్రీనివాసరావు, చింతమనీడి నాగ సోమరాజు అబ్బాయి, గొల్లపల్లి రాంబాబు తదితరులు ఉన్నారు.



వీరబాబు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి



సుబ్బారావు భార్య చెల్లాయమ్మకు రూ.3 లక్షల చెక్కు అందిస్తున్న దృశ్యం



కాకినాడలో పర్యటిస్తున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో కరచాలనం చేస్తున్న మహిళలు

జగ్గంపేటలో వీరబాబు కుటుంబానికి పరామర్శ

జగ్గంపేట,జనవరి24: జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట మండలం గుర్రప్పాలెం గ్రామానికి చెందిన పడాల వీరబాబు కుటుంబాన్ని బుధవారం నారా భువనేశ్వరి పరామర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గతేడాది సెప్టెంబరు 19న గుండెపోటుతో మృతి చెందిన వీరబాబు కుటుంబ సభ్యులను కలిసి వారికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి జగ్గంపేట మండలం గుర్రప్పాలెం ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. నేరుగా వీరబాబు ఇంటికి చేరుకుని అతని భార్యని, కుటుంబ సభ్యులను పరామర్శించడంతోపాటు టీడీపీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యే చినరాజప్ప, నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఉండవల్లి వీర్రాజు, పాఠంశెట్టి మురళీకృష్ణ, కొత్త కొండబాబు, పాఠంశెట్టి రవి, జ్యోతుల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో రూ. 3 లక్షల చెక్కు అందజేత

పెద్దాపురం, జనవరి 24 : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర బుధవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో సాగింది. చంద్రబాబును స్కిల్ డవలప్‌మెంట్ కేసులో జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై మృతి చెందిన బుద్దాల సుబ్బారావు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. మృతుడు భార్య చెల్లాయమ్మ, కుమారులు రాజబాబు, సూరిబాబులను భువనేశ్వరి పరామర్శించి వారికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు తనయుడు మాట్లాడుతూ తన తండ్రి టీడీపీని ఎంతో అభిమానించేవారని, ఓసారి పార్టీ పనిపై హైదరాబాద్ వెళ్తే తన తండ్రి వద్ద డబ్బులు అయిపోయాయని, విషయాన్ని చంద్రబాబుకు చేరవేస్తే ఆయన సీఎంగా ఉన్న సమయంలో తన తండ్రికి ఏసీ బస్సు టిక్కెట్ తీయించి ఇంటికి పంపించారని గుర్తుచేస్తూ అప్పటికి టిక్కెట్‌ను చూపిస్తూ విలపించారు. దీంతో భువనేశ్వరి సైతం ఇదంతా విని చలించిపోయారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాసూరిబాబు రాజు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో ఘన స్వాగతం.. నేటి టూర్ షెడ్యూల్ ఇలా..

కాకినాడ జిల్లా పర్యటన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చేరుకున్న నారా భువనేశ్వరికి టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో బసచేసిన భువనేశ్వరి గురువారం ఉదయం 10 గంటలకు బయలుదేరి పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి మండలం ఎస్.మూలపొలం వెళ్లి బాధిత కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తారు. తర్వాత ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి మధ్యాహ్నం 12.25 గంటలకు వెళతారు. అక్కడి నుంచి అల్లవరం మండలం రెల్లుగడ్డ వెళతారు. 1.40 గంటలకు పేరూరులో లంచ్‌కు ఆగుతారు. అనంతరం రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని విశ్వేశ్వరాయపురానికి, అక్కడి నుంచి కపిలేశ్వరపురం మండలం నల్లూరుకు సాయంత్రం 5.30 గంటలకు, మండపేట పరిధిలోని పాలతోడుకు 6.40 గంటలకు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి రాత్రి 7.10 గంటలకు చేరుకుని ఆ కుటుంబాలకు చెక్కులు అందిస్తారు.

ఓట్ల తొలగింపునకు తప్పుడు ఫారం-7లు దాఖలు

- నలుగురిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు
- కాకినాడలో 126 మందిపై 23 కేసులు..

గొల్లప్రోలు, జనవరి 24: ఓట్ల తొలగింపునకు తప్పుడు ఫారం-7లు దాఖలు చేసిన నలుగురు వ్యక్తులపై గొల్లప్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జాబితా నుంచి అయిదు అంతకుమించి ఓట్లు తొలగించాలంటూ దాఖలైన ఫారం-7 దరఖాస్తులపై అధికార యంత్రాంగం ప్రత్యేక విచారణ నిర్వహించింది. ఏఈఆర్‌వోల నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాలను ఏర్పాటుచేసి వీటిపై విచారణ జరిపారు. వీటిలో 90శాతంపైగా తప్పుడు ఫిర్యాదులుగా తేలింది. దీనిపై గొల్లప్రోలు పట్టణ ఏఈఆర్‌వోగా ఉన్న నగర పంచాయతీ కమిషనరు సత్యనారాయణ, మండల ఏఈఆర్‌వోగా ఉన్న తహశీల్దారు వెంకటేశ్వరరావులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన కట్టా బుల్లేశ్వరరావు పేరుపై గొల్లప్రోలు మండలంలో 25 ఓట్లు, పట్టణంలో రెండు ఓట్లు, కొత్తపల్లి మండలంలో ఒక ఓటు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై విచారణ జరపగా గొల్లప్రోలు మండలంలోని రెండు దరఖాస్తులు మాత్రమే వాస్తవమని తేలింది. ఈయన పేరుపై దాఖలయిన మిగిలిన 26 దరఖాస్తుల్లో వాస్తవం లేదని తేలింది. కట్టా బుల్లేశ్వరరావు ప్రస్తుతం తాటిపర్తి సర్పంచ్‌గా ఉండగా, తాను ఆ దరఖాస్తులు చేయలేదని, ఎవరో కావాలని తన పేరుపై తప్పుడు దరఖాస్తులు చేశారని చెబుతున్నారు. దుర్గాడ గ్రామానికి చెందిన నాగళ్ల కృష్ణమూర్తి పేరుపై గొల్లప్రోలు మండలంలో 11 ఓట్లు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులు రాగా అవన్ని తప్పుడివిగా తేలింది. చేబ్రోలు గ్రామానికి చెందిన ఉలవకాయల ఈశ్వరుడి పేరుతో గొల్లప్రోలు మండలంలో 13, పట్టణంలో 3 ఓట్లు తొలగింపునకు దరఖాస్తులు రాగా అవన్నీ తప్పుడు దరఖాస్తులుగా అధికారుల విచారణలో వెల్లడైంది. అదేవిధంగా గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన మొగలి రాముడు పేరుపై గొల్లప్రోలు పట్టణంలో 20 ఓట్లు, మండలంలో నాలుగు ఓట్లు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తులురాగా అన్నీ తప్పుడివిగా తేలింది. పిఠాపురం మండలంలో 2 దరఖాస్తులు రాగా ఒకటి మాత్రమే వాస్తవమని నిర్ధారించారు. ఈ దరఖాస్తులన్నీ నేషనల్ ఓటరు సర్వీస్ పోర్టల్ ద్వారా దాఖలైనట్టు గుర్తించారు. తప్పుడు ఫారం-7 దరఖాస్తులు ఇచ్చిన నలుగురు వ్యక్తులపై ఏఈఆర్‌వోలు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పిఠాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నలుగురు వ్యక్తులపై సెక్షన్ 177, 182, ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 31 కింద రెండు కేసులు నమోదు చేశారు. కాగా కాకినాడ సిటీలో 23 కేసులు నమోదయ్యాయి. 126 మందిపై నమోదు చేశారు.





సూర్యారావుపేట బీచ్‌కు కొట్టుకొచ్చిన వంకధరి శ్వేత మృతదేహం.. ఫైల్‌ఫొటో

నేమాం సాగరతీరంలో మెడికో విద్యార్థిని మృతదేహం

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

సర్పవరం జంక్షన్, జనవరి24: చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. చదివిన అన్ని క్లాస్‌ల్లో ఫస్ట్‌గా వచ్చేది. ఎంసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి తన జీవితాశయమైన వైద్య కోర్సులో చేరింది. ఎంబీబీఎస్ ఆఖరి సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. ఏమైందో ఏమో తెలియదు కానీ ఆ మెడికో విద్యార్థి మృతదేహం నేమాం సాగరతీరానికి కొట్టుకురావడం తీవ్ర కలకలం రేపింది. కాకినాడ సూర్యనారాయణపురం రంగయ్యానాయుడు వీధికి చెందిన (2018-2023) బాచ్‌కు చెందిన వంకధరి శ్వేత (25) ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో సీటు సాధించింది. ఎంబీబీఎస్ నాలుగో ఏడాది వైద్య విద్యనభ్యసిస్తోంది. మరో రెండేళ్లలో డాక్టర్‌గా పట్టా పుచ్చుకుని బయటకు వచ్చే క్రమంలో అకస్మాత్తుగా అనుమానాస్పదంగా మెడికో శ్వేత మృతదేహం కాకినాడ రూరల్ మండలం నేమాం చౌదరి గెస్ట్‌హౌస్ సాగరతీరానికి కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందివ్వడంతో తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ షరీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఐడీ కార్డుని పరిశీలించి మెడికోగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈమె డేస్కాలర్‌గా ఇంటి నుంచి మెడికల్ కాలేజీకి వెళ్లి వస్తూండేది. బుధవారం ప్రాక్టికల్ క్లాసులు ఉండడంతో తండ్రి కుబేరరావు ఉదయం ఆర్ఎంసీ కాలేజీ వద్ద డ్రాప్ చేసి, సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి తీసుకెళ్లేందుకు రాగా తిమ్మాపురం పోలీసులు నుంచి కుమార్తె మృతదేహం లభ్యమైనట్టు సమాచారం రావడంతో కన్నీరుమున్నీరు అయ్యారు. మృతికి కారణాలు తెలియలేదు.





గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టు షెడ్లలో ఉండిపోయిన పట్టుగూళ్లు.. అదే గ్రామంలో మూతబడిన పట్టుగూళ్ల మార్కెట్

పట్టుగూళ్ల కొనుగోళ్లు బంద్

- కొనేవారు లేక కర్నాటకలో విక్రయిస్తే నష్టాలు
- రీలర్లు సమ్మెతో పట్టు రైతుల అగచాట్లు
- ఇన్సెంటివ్ బకాయిలపై తేల్చని ప్రభుత్వం

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, జనవరి 24: పట్టుగూళ్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి. రీలర్ల సమ్మెతో కొనేవారులేక పట్టురైతులు నానా అగచాట్లు పడుతున్నారు. కర్నాటక రాష్ట్రం తీసుకువెళ్లి విక్రయిద్దామంటే నష్టాలు వస్తుండడం, పట్టుగూళ్లు దెబ్బతింటుండడంతో ఏమి చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పట్టుగూళ్లు విక్రయించిన రైతులు, రీలర్లుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించకపోవడంతో రీలర్లు సమ్మెబాట పడ్డారు. ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఏకైక మార్కెట్‌గా ఉన్న గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టుగూళ్ల మార్కెట్ మూతబడింది. సాధారణ రోజుల్లో ఇక్కడ 20 క్వింటాళ్ల పట్టుగూళ్ల క్రయ, విక్రయాలు జరుగుతూ ఉంటాయి. సీజన్‌లో ఇది దాదాపు రెట్టింపు ఉంటుంది. వారం రోజులుగా పట్టుగూళ్లను ఎవ్వరు కొనకపోవడంతో చేబ్రోలు పరిసర ప్రాంతాల్లోని పట్టుషెడ్లల్లో సుమారు 100 క్వింటాళ్ల వరకూ పట్టుగూళ్లు ఉండిపోయాయి. కొనేవారు లేకపోవడం, పక్వానికి వచ్చిన పట్టుగూళ్లను అలా ఉంచితే పది రోజులకు పురుగు బయటకు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక్కడ డయర్ లేకపోవడం, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో పట్టుగూళ్లు దెబ్బతినే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు.

కర్నాటకకు వెళ్లి విక్రయిద్దామనుకున్నా..

చేబ్రోలుతో సహా రాష్ట్రంలోని అన్ని పట్టుమార్కెట్‌ల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీనితో పట్టుగూళ్లను విక్రయించే అవకాశాలు లేక రైతులు కర్నాటకకు తీసుకువెళ్లి విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర మార్కెట్‌ల్లో పట్టుగూళ్లు కిలో ధర రూ.400 వరకూ ఉండగా, దీనికి అదనంగా ప్రభుత్వం రూ.50 ఇన్సెంటివ్‌గా ఇస్తుంది. రీలర్లుకు ప్రోత్సహకాలుంటాయి. కర్నాటకలో మాత్రం కిలో పట్టుగూళ్ల ధర రూ.300 మాత్రమే ఉంది. దీంతో అక్కడికి పట్టుగూళ్లు తీసుకువెళ్లితే విక్రయించగా వచ్చిన సొమ్ము రవాణా చార్జీలకే సరిపోతున్నదని రైతులు తెలిపారు. మరోవైపు పట్టురైతులు, రీలర్లుకు రావాల్సిన ఇన్సెంటివ్ బకాయిల విషయంపై ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రీలర్లు సమ్మె చేస్తున్నా, పట్టు రైతులు ఆందోళనలకు దిగినా ప్రభుత్వంలో స్పందన లేదు. ఇప్పటివరకూ పట్టుపరిశ్రమశాఖ ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో సమ్మె ఎప్పటికి తేలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇన్సెంటివ్ బకాయిలు నూరుశాతం చెల్లిస్తేనే సమ్మె విరమిస్తామని రీలర్లు తేల్చి చెబుతుండడంతో అప్పటివరకూ పట్టుగూళ్ల కొనుగోళ్లు జరిగే అవకాశం కనబడడం లేదు. ఇదే జరిగితే పట్టురైతులు కోట్ల విలువ చేసే పంటను కోల్పోయే ప్రమాదం ఉంది.

ఇన్సెంటివ్ బకాయిలు రూ.1.80 కోట్లు

గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టుగూళ్ల మార్కెట్ ద్వారా క్రయ, విక్రయాలు జరిపిన రైతులకు ఇంకా రూ.1.80 కోట్లు ఇన్సెంటివ్‌లు చెల్లించాల్సి ఉందని పట్టుపరిశ్రమశాఖ డీడీ రామరాజు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన రెండు రోజుల్లో అన్నారు.. ఆరునెలలు గడిచింది' వార్తా కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ 362 మంది రైతులకు రూ.36.5 లక్షలు చెల్లించామన్నారు. పాత బకాయిలు రూ.1.80 కోట్లు కోసం పట్టు పరిశ్రమ కమిషనరుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

వ్యాన్ కిరాయిలు కూడా రావడం లేదు



కొనేవారు లేక పట్టుగూళ్లను వారం రోజులుగా షెడ్లలోనే ఉంచాం. ఇక పురుగులు బయటకు వచ్చే సమయం దగ్గరపడిం ది. అదే జరిగితే పంటను పూర్తిగా కోల్పోతాం. ఇక్కడ రైతులు కర్నాటకలోని రామ్‌నగర్, కోలార్ మార్కెట్లుకు వెళుతుంటే వ్యాన్ కిరాయి కూడా రావడం లేదు. అక్కడ కిలో పట్టుగూళ్లను రూ.300కి మించి కొనడం లేదు.

- చల్లా సత్తిరాజు, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం



చేబ్రోలులో పట్టుగూళ్లను తగులబెడుతున్న రైతు ఓరుగంటి

పట్టుగూళ్లను తగులబెడుతున్న రైతులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 24: పట్టుగూళ్లను విక్రయించే అవకాశాలు లేక వాటిని తగులబెడుతున్నారు పట్టు రైతులు. వారం రోజులుగా రీలర్లు సమ్మె చేస్తుండడంతో పట్టురైతులు తమ పట్టుగూళ్లను షెడ్లలోనే ఉంచేశారు. పైగా పదిరోజులు దాటితే పురుగులు బయటకొచ్చి పూర్తిగా నష్టపోయే ప్రమాదముంది. పట్టుగూళ్లను అలా వదిలివేస్తే మిగిలిన పంటకు వైరస్ తెగుళ్లు వచ్చే అవకాశం ఉండడంతో చేబ్రోలు గ్రామానికి చెందిన పట్టురైతు ఓరుగంటి రామారావు తన వద్ద ఉన్న పట్టుగూళ్లను అమ్మలేక, వేరే గత్యంతరం లేక బుధవారం గుట్టగా పోసి నిప్పంటించారు.

వైసీపీ గుండాగిరీ

పెదపూడిలో జనసేన ప్రచార వాహనంపై వైసీపీ జులుం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ వాహన అద్దాలు ధ్వంసం

తాళాలు లాగేసుకుని,వాహన పత్రాలు తీసుకువెళ్లిపోయిన వైసీపీ నేతలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో అధికార వైసీపీ నేతలు గుండాగిరీకి దిగారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామగ్రామాన తిరుగుతూ ప్రచారం చేస్తున్న జనసేన ప్రచార వాహనంపై దాడికి తెగబడ్డారు. రాత్రి ఏడు తర్వాత గ్రామాల్లో తిరుగుతోందని, జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారనే సాకుతో పెదపూడి మండలంలోని శహపురంలో వైసీపీ నేతలు వాహన అద్దాలు ధ్వంసం చేశారు. వాహనం తాళాలు లాగేసుకుని, జీపు రిజిస్ట్రేషన్, ప్రచార అనుమతి పత్రాలను లాక్కుపోయారు. దీంతో బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో జనసేన, టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సైతం వైసీపీ నేతల తీరుతో మండిపడుతూ ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒకానొక సమయంలో టీడీపీ,జనసేన నేతలపై పోలీసుల సమక్షంలో వైసీపీ నేతలు దాడి చేయడానికి పైకి రావడంతో అటువైపు నుంచి కూడా ప్రతిఘటన ఎదురైంది. ఈ నేపథ్యంలో శహపురంలో సాయంత్రం ఆరు వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

దాడిచేసి..తాళాలు లాగేసి..

కాకినాడ జిల్లా పెదపూడి మండలం శహపురంలో సామర్లకోట మండలం మాధవ పట్నానికి చెందిన పన్నీరు వెంకటేశ్వరరావు, అతని కుమారుడు పన్నీరు శివన్నారాయణలు గత మూడు రోజులుగా జనసేన తరఫున ప్రచార రథంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీన్ని తట్టుకోలేక స్థానిక వైసీపీ నేతలు వాహనాన్ని రెండురోజులుగా అడ్డుకుంటున్నారు. తొలుత మంగళవారం మధ్యాహ్నం సమయంలో వైసీపీకి చెందిన బుద్ధా శ్రీను జనసేన ప్రచారవాహనాన్ని అడ్డుకున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ప్రచార వాహనాన్ని నడుపుతున్న వెంకటేశ్వరరావు ఆయన కుమారుడుని స్టేషన్‌కు తరలించారు. తీరా వాహనానికి అనుమతులు ఉండడంతో అదే రోజు రాత్రి వీరిద్దరిని పోలీసులు పంపేశారు. తిరిగి బుధవారం జనసేన ప్రచార వాహనం శహపురంలో ప్రచారం చేస్తోంది. దీంతో వైసీపీ నేత బుద్ధా వెంకన్న, స్థానిక ఎంపీటీసీ భర్త చందళ్ల వెంకటరమణ, మరికొంతమంది కలిసి ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. గ్రామంలోకి రావొద్దని హుకుం జారీ చేశారు. అనుమతులు ఉన్నాయని, కావాలంటే మీరు కూడా ప్రచారం చేసుకోండని జనసేన నేతలు అనడంతో వాహనంపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. తాళాలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో జనసేన నేతలు ఆందోళనకు దిగారు. ఓ శుభ కార్యంలో పాల్గొనడానికి వచ్చిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని సీఐ,ఎస్ఐకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసుల నుంచి స్పందన లేదు. దీంతో ఆందోళనకు దిగారు. దీంతో వైసీపీ నేతలు కూడా అక్కడకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. పక్కనే పోలీసులు ఉన్నా టీడీపీ, జనసేన శ్రేణులపైకి దాడికి వస్తున్న వైసీపీ నేతలను అడ్డుకోలేదు. కాకినాడ రూరల్ సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో జనసేన వాహనంపై దాడికి దిగిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని టీడీపీ, జనసేన శ్రేణులు డిమాండ్ చేశాయి. దీంతో మళ్లీ ఓ సారి ఇరువర్గాలు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు చెదరగొట్టారు. ప్రచార వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ వాహనానికి అనుమతులు ఉన్నా అడ్డుకోవడం వైసీపీ నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలపై కేసులు పెట్టడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్ఐ శోభన్ కుమార్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రచార వాహనాన్ని స్టేషన్‌కు తరలించామన్నారు.



వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న నేతలు

వెంకన్న హుండీల ఆదాయం రూ.1.02 కోట్లు

ఆత్రేయపురం, జనవరి 24: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు కె.విజయలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, ఎస్.ప్రసాద్‌రాజు పర్యవేక్షణలో బుధవారం హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. 35 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.74,29,750, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.28,48,913.. మొత్తం రూ.1,02,78,663 లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. బంగారం 11 గ్రాములు, వెండి 739 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి హుండీల ద్వారా రూ.2,54,454 ఆదాయం లభించింది. లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు, బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకుపోయిన ఎరువుల లారీ



అనపర్తి, జనవరి 24 : అనపర్తి మండలం కొప్పవరంలో ఎరువుల లోడుతో వచ్చిన లారీ కాకినాడ కెనాల్‌లోకి అదుపుతప్పి దూసుకుపోయింది. లారీ డ్రైవర్ అప్రమత్తం కావడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. లారీ డ్రైవర్ గోవిందు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోటలోని ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి కొప్పవరం సొసైటీకి సుమారు 400 బస్తాల యూరియాతో లారీ గ్రామానికి చేరుకుంది. అయితే సొసైటీలో సరుకును అన్‌లోడ్ చేసేందుకు లారీ కాలువ గట్టు నుంచి మలుపు తిప్పుతున్న క్రమంలో అదుపు తప్పి కాకినాడ కాలువలోకి దూసుకుపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ గోవిందు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ కాలువలో పడ్డ కొద్దిసేపటికే సుమారు 6.80 లక్షల యూరియా గంగపాలయ్యింది.

త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ

దివాన్‌చెరువు, జనవరి24 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ అందిస్తామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, యువత సాధికారత, ఉపాధి అనే అంశంపై నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని పూర్తిస్థాయిలో మన ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కరిక్యులమ్‌లో 30 శాతం నైపుణ్య కార్యక్రమాలు ఉన్నాయన్నారు. రీసోర్స్‌పర్సన్లుగా హాజరైన బెంగళూరులోని జేవీయర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కె.భట్టు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ లోకానందరెడ్డి ఐరాల వివిధ విషయాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్ పి.ఉమామహేశ్వరీదేవి, అధ్యాపకులు ఎన్.ఉదయభాస్కర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ చేరుకున్న వైఎస్ షర్మిల

నేడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ సమీక్షకు హాజరు



షర్మిలకు స్వాగతం పలుకుతున్న నేతలు

కాకినాడ సిటీ, జనవరి 24: ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాల నిమిత్తం పర్యటనలు చేపట్టిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల బుధవారం రాత్రి కాకినాడలోని హోటల్ జీఆర్‌టీ గ్రాండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు, ఏఐసీసీ కాకినాడ పార్లమెంట్ కోఆర్డినేటర్ కేబీఆర్ నాయుడు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ, పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు స్వాగతం పలికారు. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం రోడ్డు మార్గం గుండా బయలుదేరి కాకినాడ చేరుకున్నారు. రాత్రికి కాకినాడలో షర్మిల బస చేస్తారు. కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఉదయం జీఆర్‌టీ వద్దకు చేరుకోనున్నారు. ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి నాయకులు వెంట రాగా కాన్వాయ్‌గా బయలుదేరి కుళాయిచెరువు నూకాలమ్మ గుడి సెంటర్, జవహర్‌రోడ్, మెయిన్‌రోడ్, టౌన్ హాల్ మీదుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని విజిటర్స్ బుక్ లో సంతకం చేస్తారు. అనంతరం సూర్యకళా మందిరం సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఏలూరు బయలుదేరి వెళ్తారు. షర్మిల వెంట పీసీసీ మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఏఐసీసీ కార్యదర్శి జేడీ శీలం ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే విజయాలు

- స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్
- పలువురు ప్రముఖులకు వివేకానంద పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

అనపర్తి, జనవరి 24 : ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏదీ లేదని, స్వామి వివేకానందుడు చెప్పిన మార్గాలను అనుసరించడం ద్వారా విజయం మన చెంతనే ఉంటుందని స్వర్ణ భారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె దీపావెంకట్ అన్నారు. అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద యువజనోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువజనోత్సవం సందర్భంగా అనపర్తిలోని వివేకానంద సెంటర్‌లో స్వామి వివేకానందుడి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ గాలిలోకి బెలూన్లను ఎగురవేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుప్పలపూడిలోని ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన యువ జనోత్సవంలో 2024 ఏడాదికి గాను ఆధ్యాత్మిక రంగంలో సేవలందిస్తున్న ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, వైద్య రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ గోలి వెంకటరామారావు, న్యాయ రంగంలో సేవలందిస్తున్న హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డిలకు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలను, స్వర్ణ భారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపా వెంకట్‌కు స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డులతో పాటు స్వామి ప్రతిమ, మెమెంటోలను ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి జీవితంలో ముందడుగు వేసేలా చైతన్య పరచడమే స్వామి వివేకానందుని లక్ష్యమని అన్నారు. దీపా వెంకట్ ప్రసంగిస్తూ సేవ చేయడం ద్వారా ఆత్మ సంతృప్తి లభిస్తుందని తన తండ్రి వెంకయ్య నాయుడి స్ఫూర్తితో ట్రస్టును ప్రారంభించి గ్రామీణ ప్రాంతాలలో యువతకు పలు అంశాలపై శిక్షణను అందిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా సమితి సేవలు అందించడమే కాకుండా వివేకానందుని భావజాలాన్ని యువతలోకి తీసుకువెళ్లేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. స్వామీజీ మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభాలు వంటి యువతలో ఉత్సాహం నింపడమే స్వామీజీ లక్ష్యంగా జీవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, సత్తి లక్ష్మణరెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, చింతా గోపీకృష్ణారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గాప్రసాద్, సమితి ప్రతినిధులు సత్తి బులితమ్ము, తేతల సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన రేవు శ్రీను



కె.గంగవరం, జనవరి 24: ఎన్నికల ముందు రామచంద్రపురం నియోజకవర్గంలో వైసీపీకి పెద్ద దెబ్బతగిలింది. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు అత్యంత సన్నిహితుడైన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను) బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలో గతంలో జరిగిన ఎన్నికల్లో తోట త్రిమూర్తులు విజయానికి విశేష కృషి చేసిన వ్యక్తుల్లో రేవు శ్రీను ఒకరు. ప్రస్తుత పరిస్థితుల్లో రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా రేవు శ్రీను పోటీ చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. బుధవారం చంద్రబాబును కలవడంతో వాటికి మరింత బలం చేకూరాయి. శ్రీను మంచి ముహూర్తం చూసుకుని పార్టీలో చేరతారని ఆయన వర్గీయులు చెబుతున్నారు.

పోక్సో కేసులో యువకుడికి రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి), కాకినాడ క్రైం: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి కోర్టు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన చింతపల్లి సుబ్బారావు రోజూ ఓ బాలిక వెంటపడి వేధించేవాడు. 2018 సెప్టెంబరు 17న ఆ బాలిక తన పెద్దమ్మ దుకాణం వద్ద ఉండగా ఆ యువకుడు చున్నీ పట్టుకు లాగాడు. దీనిపై పెద్దమ్మ నిలదీయగా ఆమెను కొట్టాడు. ఆమె ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నేరస్తుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసుల ప్రత్యేక పర్యవేక్షణ సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది పితాని శ్రీనివాసరావు, ఏఎస్ఐ సీహెచ్ రామన్నదొర, అప్పటి ఎస్ఐ ఆర్.శివాజీ, సీఐ జీ.ఉమామహేశ్వరరావు, ఎస్ఐ కె.సతీశ్, హెచ్‌సీ ఎం.సత్యకుమార్, కానిస్టేబుల్ సతీశ్‌ని ఎస్పీ అభినందించారు.

రౌడీషీటర్‌కి రెండేళ్ల జైలు

పెండింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్న గుజ్జర్ల రామకృష్ణని అదుపులోకి తీసుకోవడానికి అతడి ఇంటికి 2022 మార్చి 2న ఎస్ఐ అప్పారావు, కానిస్టేబుల్ అశోక్ వెళ్లారు. పోలీసులతో రామకృష్ణ వాగ్వాదానికి దిగడంతో పాటు ఎస్ఐని ఎదురుబొంగుతో కొట్టి గాయపరిచాడు. రామకృష్ణని అదుపు చేయడానికి కానిస్టేబుల్ అశోక్ ప్రయత్నించగా ఆయనపై బటన్‌నైఫ్‌తో దాడి చేశాడు. నేరం రుజువు కావడంతో రామకృష్ణకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పీపీ కోడి సతీష్‌నాయుడు, త్రీటౌన్ సీఐ వీరయ్యగౌడ్, అప్పటి ఎస్ఐ టి.శ్యాంసుందర్, హెచ్‌సీ ఎన్.వెంకటేశ్వరరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్



ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీస్తున్న కేంద్ర మంత్రి

దివాన్‌చెరువు, జనవరి 24 : కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డులోని హెల్త్‌క్లినిక్‌ను కేంద్ర మంత్రి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా అందజేస్తున్న వివిధ ఆరోగ్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యపరంగా తీసుకుంటున్న చర్యలకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జగనన్న కంటి వెలుగు లబ్ధిదారునికి కంటి అద్దాలు అందించారు. పీహెచ్‌సీ ద్వారా అందజేస్తున్న సేవలను నిక్షిప్తం చేయడం ద్వారా ఫాలోఅప్ వైద్యసేవలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ చేపట్టి ప్రజల వద్దకే వైద్యసేవలు వెళుతున్నాయన్నారు. అనంతరం టీబీ బాధితునికి నిక్షయ మిత్రా కిట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వసుంధర, పాలచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బెనడిక్ట్, డాక్టర్ శ్రీరాణి, బీజేపీ నాయకులు సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ పోటీల విజేత హరియాణా

కాకినాడ రూరల్, జనవరి 24: కాకినాడలో 5 రోజులపాటు నిర్వహించిన 67వ జాతీయస్థాయి బాలుర లాన్‌టెన్నిస్ పోటీలు బుధవారం మధ్యాహ్నం ముగిశాయి. 19 ఏళ్ల లోపు బాలురకు నిర్వహించిన ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు పాల్గొనగా మొత్తం 154 మ్యాచ్‌లు జరిగాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలో గల స్మార్ట్‌సిటీ టెన్నిస్ క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయన్నారు. వ్యక్తిగత విభాగంలో హరియాణా క్రీడాకారుడు అర్జున్‌రాఠీ ప్రథమ స్థానంలోనూ, తెలంగాణకు చెందిన వి.ధీరజ్ ద్వితీయ, గుజరాత్ క్రీడాకారుడు వహీన్‌పటేల్ తృతీయ, తెలంగాణకు చెందిన శాండిల్య నాలుగో స్థానంలోనూ నిలిచారు. టీమ్ విభాగంలో ప్రథమ స్థానంలో హరియాణా, ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో ఢిల్లీ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల ముగింపోత్సవ, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి, చీఫ్ రిఫరీ శ్రీకుమార్, కర్రి భామిరెడ్డి పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి టీవీఎస్‌వీ ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు. కన్నబాబు మాట్లాడుతూ శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు సహకరిస్తాయన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను, ప్రతిభా పత్రాలను అందజేశారు. రాష్ట్ర టెన్నిస్ సంఘం కార్యదర్శి కుమార్, డీవైఈవోలు డేనియల్ రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుర, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి, శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు, సూరిబాబు, హుస్సేన్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

నాటకాలను బతికించుకోవాలి



కొత్త పరిమళంలో సన్నివేశం

పెద్దాపురం, జనవరి 24: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఎంతైనా ఉందని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి నాటికల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, కురుమెళ్ల లోవరాజు మాట్లాడుతూ మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలన్నారు. ద్వేషం అనేది మనిషికైనా, దేశానికైనా ప్రమాదమే అనే సందేశంతో సాగిన కొత్త పరిమళం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికకు కాండ్రేగుల శ్రీనివాసరావు రచన చేయగా కేఎల్ స్వామి నాటకీకరణ చేశారు. ఎం.హేమాపట్నాయక్ దర్శకత్వం వహించారు. శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బోరివంక (శ్రీకాకుళం జిల్లా)కు చెందిన నటులు ఈ ప్రదర్శన ఇచ్చారు. రెండో ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. మేధావుల నిశ్శబ్దం జాతికి ఎంతో ప్రమాదమనే అంశంతో ఈ నాటిక సాగింది. తెలుగు కళా సమితి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించగా ఈ నాటికకు రచన పీటీ మాధవ్, పర్యవేక్షణ కువైట్ స్వామి, దర్శకత్వం కృష్ణప్రసాద్ వహించారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, సీఎస్ఆర్ మూర్తి, ఇంధన బ్రహ్మానందం, రవీంద్ర, కేదార నాగు, మంతెన సత్తిబాబు, పాలని సత్తిబాబు, పాపేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదివాసీ వ్యతిరేక చర్యలను ప్రభుత్వం మానుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వక్త

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 24: ఆదివాసీ వ్యతిరేక చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్లా రామిరెడ్డి అన్నారు. రూరల్ మండలం ధవళేశ్వరంలోని ఓ కమ్యూనిటీ హాలులో పోలవరం నిర్వాసితుల సంఘీభావ సదస్సు ఎల్లా రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో సంపదను అడవిని, చెట్లను, అన్నిటిని కాపాడేది ఆదివాసులే అన్నారు. అటువంటి ఆదివాసీలను అడవి నుంచి వెళ్ల గొట్టే కుట్రలు చేయడం దారుణమన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాసానికి కేంద్రం పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ స్పష్టం చేశారు. ఆదివాసీల లీగల్‌సెల్ కన్వీనర్ పల్లా త్రినాథ్ మాట్లాడుతూ ఆదివాసీలు ధర్మమైన డిమాండ్లు అడుగుతున్నారని, వారికి భూమికి భూమి, మెరుగైన పునరావాసం కల్పించడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అన్నారు. రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ జాన్సీ మాట్లాడుతూ 2017లో కొండమొదలు గిరిజనులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని నిర్వాసితులందరికీ వర్తింపచేయాలన్నారు. పునరావాస కాలనీలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, 426 ఎకరాల భూమికి భూమిని పునరావాస కేంద్రంలో కల్పించాలని డిమాండ్ చేశారు. దేవీపట్నం, కురుపల్లి నిర్మాణంలో జరుగుతున్న పనులను సరిచేసి వెంటనే కాలనీల నిర్మాణం చేయాలని ఏలూరు జిల్లాలో తెల్లవారు చేగుంటపల్లి గ్రామాలకు భూమికి భూమి ఇవ్వాలని రాష్ట్ర కార్యదర్శి ఎం ఎస్ నాగరాజు అన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి






అనపర్తి, జనవరి 24 : అనపర్తి మండలం రామవరం శివారు రామదాసు పుంత రోడ్డులో రాయవరం వెళ్లే దారిలో రోడ్డు పక్కనే గుడిసె వేసుకుని జీవిస్తున్న జంట అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటం సంచలనంగా మారింది. అయితే వారు సంచార జీవనం సాగిస్తున్నారని, నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఎస్ఐ రామారావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామదాసు పుంత రోడ్డులో గుడిసె వేసుకుని సహజీవనం చేస్తున్న సూరిబాబు (35), మేడపాటి లక్ష్మి (45) బుధవారం ఉదయం మృతి చెంది ఉండటాన్ని గమనించి రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వారు సుమారు నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నారని, ఎలుకలు పట్టుకుని జీవిస్తుంటారని నిత్యం మద్యం మత్తులో ఉంటారని స్థానికులు చెప్పారన్నారు. లక్ష్మి బంధువులు పెదపూడి మండలం గండ్రేడులో ఉన్నారని తెలియడంతో వారికి సమాచారం అందించామన్నారు. శవ పంచనామాలు నిర్వహించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని మృతదేహాలను అనపర్తి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ రామారావు తెలిపారు.

29న రాజమహేంద్రవరంలో 'రా కదలిరా' సభ

హాజరుకానున్న చంద్రబాబు

రాజమహేంద్రవరం, జనవరి24(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29వ తేదీన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో జరిగే తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా బహిరంగ సభలో పాల్గొననున్నారు. వాస్తవానికి ఈ సభను ఈ నెల 27న నల్లజర్ల మండలం దూబచర్లలో నిర్వహించాల్సి ఉంది. కానీ జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనడానికి దూరం అవుతుందనే కారణంతో రాజమహేంద్రవరానికి మార్పు చేశారు. ఫోర్త్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు దగ్గరలో కొంతమూరు, కోలమూరు ప్రాంతాల్లో సభా స్థలం కోసం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పరిశీలించారు. 26న నారా భువనేశ్వరి బిక్కవోలులోనూ, నిడదవోలులోనూ "నిజం గెలవాలి" అనే కార్యక్రమంలో పాల్గొంటున్న విషయం తెలిసిందే.

నేపాల కాయలు తిని చిన్నారులకు అస్వస్థత



ఏలూరు క్రైం/నల్లజర్ల, జనవరి 24 : బేరన్ పొగాకు కొట్టే పనులకు వలస కూలీలుగా వచ్చిన వారి పిల్లలు నేపాల చెట్టు కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లా ప్రాంతాలకు చెందిన 22 మంది వలస కూలీలు నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలోని పొగాకు రైతుల బేరన్ పొగాకు కొట్టే పనుల కోసం 12 రోజుల క్రితం వచ్చారు. వారితో పాటు 11 మంది పిల్లలు కూడా వచ్చారు. పెద్దలు పనికి వెళ్లిన సమయంలో బుధవారం మధ్యాహ్నం పిల్లలు మకాం సమీపంలోని నేపాల చెట్ల కాయలను తిని ఎనిమిది మంది వాంతులు చేసుకున్నారు. తల్లిదండ్రులు వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో ప్రసాదరెడ్డి, చిన్నపిల్లల వైద్య చికిత్స విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.దీపక్‌కుమార్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పారు.

రౌతులపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పర్యటన?

రౌతులపూడి, జనవరి 24: మాజీ మంత్రి ముద్రగడ గురువారం రౌతులపూడి మండలంలో పర్యటించనున్నారు. రాజవరంలో కాలికి గాయమైన ఓ నాయకుడిని, బలరామపురంలో సోమరౌతు చంటిబాబు, ఎ.మల్లవరంలో పల్లి సూరిబాబు కుటుంబీకులను పరామర్శించనున్నారు. జనసేనలోకి ఆయన చేరే అవకాశాలు ఉండడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

తాగునీటి కోసం అల్లాడిన ప్రజలు

» కాకినాడ నగరంలో మూడు రోజులుగా ట్యాంకర్ల వద్ద ఇక్కట్లు

కాకినాడ సిటీ, జనవరి 24: కాకినాడలో మూడురోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో బిందెలు పట్టుకుని ట్యాంకర్ వద్ద మహిళలు పరుగులు తీశారు. నీటికోసం వాదులాటలు, ఖాళీ బిందెలతో తోపులాటలు చోటుకున్నాయి. మూడురోజులుగా కుళాయిలనంచి తాగునీరు సరఫరా కాక కాకినాడ నగరం డెయిరీఫారమ్ ఏరియాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో చోటుచేసుకున్న దుస్థితి. 40వేలమంది తాగునీటి కోసం అల్లాడారు. ప్రత్యామ్నాయ తాగునీటి, వాడకం నీటి అవసరాలకు వార్డుల్లో పబ్లిక్ కుళాయిలు, నేల బోరింగ్ ఉండేవి. సామర్లకోట నుంచి కాకినాడకు వచ్చే తాగునీటి మెయిన్ పైప్‌లైన్ ఏడీబీ రోడ్డులో దెబ్బతినడంతో మరమ్మతులు చేపట్టారు. ఈ మరమ్మతులకు మూడురోజుల సమయం పట్టింది. బుధవారం సాయంత్రానికి మరమ్మతులు పూర్తయినా ట్రయిల్ రన్ వేయాల్సి ఉంది. ఈ రన్‌లో లీకేజ్‌లు బయటపడితే ప్రజలు తాగునీటి కోసం అల్లాడాల్సిందే. దీనిపై కలెక్టర్‌కు వినతులు అందడంతో సత్వరం తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు.

సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు టీడీపీ నాయకులు వినతి

నగరంలో తాగునీటి సరఫరా అంతరాయంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, మాజీ కార్పొరేటర్ వొమ్మి బాలాజీ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మూడురోజులుగా సామర్లకోటనుంచి కాకినాడకు వచ్చే తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా 40వేలమంది ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. ట్యాంకర్ల ద్వారా అరకొర సరఫరా చేస్తున్న తాగునీరు సరిపడక నీటికి వాగ్వివాదాలు జరుగుతున్నాయన్నారు. తాగునీటి సమస్యపై అధికారులు సమీక్షలు చేపట్టకపోవడంతో పైప్‌లైన్ల పరిస్థితులు తెలియక మరమ్మతులకు మూడురోజులపాటు కసరత్తు చేశారన్నారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రజల తాగునీటి అంతరాయం సమస్య పరిష్కరిచాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడలి వెంకటరమణ, చోడిపల్లి సతీష్, కాశరపు సింహాద్రి, శివ, వరలక్ష్మి పాల్గొన్నారు.



తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద మహిళల పాట్లు

భువనేశ్వరికి సత్యప్రభ ఘన స్వాగతం



భువనేశ్వరితో సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 24: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం కాకినాడ జిల్లా పర్యటనకు రావడంతో రాజమమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయంలో ఆమెకు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభరాజా ఘనస్వాగతం పలికారు. మాజీమంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, కేఎస్ జవహర్‌లతో కలిసి ఆమె వెంట వెళ్లారు.

అడుగడుగునా ఆత్మీయ పలకరింపు

తుని రూరల్, జనవరి 24: తుని నియోజకవర్గంలోని ఎర్రకోనేరుకు నారా భువనేశ్వరి రాకను తెలుసుకుని పెద్ద ఎత్తున మహిళలతోపాటు టీడీపీ శ్రేణులు చేరుకున్నారు. దారి పొడవునా పెద్దఎత్తున నిల్చున్న మహిళలను భువనేశ్వరి ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు వెళ్లారు.

భువనేశ్వరిని కలిసిన వర్మ



భువనేశ్వరితో వర్మ

పిఠాపురం, జనవరి 24: నారా భువనేశ్వరిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం కలిశారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న ఆమెను కలిసి నియోజకవర్గానికి సంబంధించిన విషయాలను వివరించారు.

'క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం'

పిఠాపురం, జనవరి 24: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు.

గృహ నిర్మాణంపై సమీక్ష

ప్రత్తిపాడు, జనవరి 24: మండలంలో గత మూడేళ్లలో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో 1669 గృహాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు మండల గృహనిర్మాణశాఖ ఏఈ అత్తిలి ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన గృహనిర్మాణశాఖ తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీడీవో ఎం వీఆర్ కుమార్‌బాబు, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), జనవరి 24: వైద్యఉద్యోగుల అపరిష్కృత సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీమెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. కాకినాడ జీజీహెచ్‌లో ఏపీమెడికల్ ఎంప్లాయిస్ కాకినాడశాఖ ఆధ్వర్యంలో మాతా,శిశు విభాగం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బుడ్డిగ స్వామిబాబు మాట్లాడుతూ ఏపీ కమిటీ పిలుపు మేరకు రెండురోజుల నిరసనలో భాగంగా ఆందోళన చేపట్టామన్నారు. కాకినాడశాఖ అధ్యక్షుడు కట్టిమేను మోహన్‌రావు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ నివేదిక ఆలస్యమైనందున మధ్యంతర ఉపశమనం ఐఆర్ 36 శాతం మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎస్.రాజబాబు, సహాయ కార్యదర్శులు వి.సత్యనారాయణ, కె.పండు, సభ్యులు టి.మంగతాయారు, సోము లింగేశ్వరరావు, లక్ష్మి నారాయణ, వెంకట్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో స్టార్ట్ అఫ్ డే వేడుకలు

గండేపల్లి, జనవరి 24: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐసీ, ఇడీసీ ఆధ్వర్యంలో స్టార్ అఫ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన మారుతి కనస్ట్రక్షన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పి.భానుప్రజిత ఆన్‌లైన్ ద్వారా పాల్గొని తమ సందేశాన్ని అందించారు. ఇన్నోవేషన్, స్టార్టప్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. ఐఐసీ, ఈడీసీ విభాగం కన్వీనర్ డాక్టర్ పీఎస్ రంజిత్, కోఆర్డినేటర్ సీహెచ్ గోవింద్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

జగ్గంపేట, జనవరి 24: గోవిందపురంలో వికసిత భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, ఇస్తున్న రాయితీలపై ప్రజలు వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 100శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాల్ని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేత కందుల వెంకట అచ్యుత రామారావు, సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

27నుంచి 'వైఎస్ఆర్ ఆసరా': కమిషనర్

కార్పొరేషన్,జనవరి 24: కాకినాడలో ఈనెల27నుంచి 31 వరకు వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నాగనరసింహారావు తెలిపారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో బుధవారం వైఎస్ఆర్ ఆసరా పంపిణీ ప్రక్రియపై పీవోలు, ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఇదే అంశంపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు.

పౌష్టికాహారానికి పురుగులు

» వీటిని పంపిణీ చేయలేమంటున్న అంగన్‌వాడీలు



ఎస్.అన్నవరంలో కుళ్లిన కోడిగుడ్లు

తుని రూరల్, జనవరి 24: తమ హక్కులు నెరవేర్చాలంటూ 42రోజులు అలుపెరగని పోరాటం చేసిన అంగన్‌వాడీ సిబ్బంది ఎట్టకేలకు ఆయా కేంద్రాలకు హాజరయ్యారు. సమ్మె కాలంలో అంగన్‌వాడీ సెంటర్లు అస్తవ్యస్తంగా మారాయి. తుని అర్బన్, రూరల్ పరిధిలో 314 అంగన్‌వాడీ కేంద్రాల్లో 650మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు సమ్మె బాట పట్టడంతో సెంటర్ల బాధ్యత సచివాలయ సిబ్బందికి అప్పగించగా ప్రభుత్వం అందజేసిన పౌష్టికాహార కిట్లు సెంటర్లలో ఉండిపోయాయి. వాటి పంపిణీ సక్రమంగా జరగపోవడంతో చాలాచోట్ల కాలం చెల్లి పౌష్టికాహార కిట్లకు పురుగులు పట్టాయి. వీటిని స్వాధీనపరుచుకుంటున్న అంగన్‌వాడీలు పాడైన సరుకులు ఎలా పంపిణీ చేసేదని తలలు పట్టుకుంటున్నారు.

కబ్జా నాటికకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శన బహుమతి

సామర్లకోట, జనవరి 24: సామర్లకోటకు చెందిన శృంగార వల్లభ ఆర్ట్స్ ప్రదర్శించిన కబ్జా నాటికకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. మధ్యప్రదేశ్‌లోని తెలుగువారు అధికంగా నివసించే బిలాయ్‌లోని ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి నాటికల ప్రదర్శనల పోటీల్లో ఎంపికై ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనల విభాగంలో బహుమతులు అందుకుంది. మంగళవారం రాత్రి వరకూ బిలాయ్‌లో జరిగిన నాటికల పోటీల్లో పాల్గొని బహుమతులతో తిరిగి సామర్లకోటకు బుధవారం వారు చేరుకోగా సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల కళాకారులు దర్శకుడు కేబీ ఆనంద్‌ను పూలమాలలతో అభినందించారు. ఈ నాటికకు రచనను కొంతం కాశీవిశ్వనాథ్ అందించారు. బహుమతులతో స్వగ్రామం సామర్లకోటకు బుధవారం చేరుకున్న కేబీ ఆనంద్‌ను సకల కళా సమాఖ్య ప్రతినిధులు బడుగు సీతారామ రాజు(బాబీ), చీమలకొండ వీరభద్రప్రసాద్ అభినందించారు.

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు: ఎంపీ బోస్

కాజులూరు, జనవరి 24: అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ హెచ్చరించారు. కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి బుధవారం ఆయన హాజరై మాట్లాడారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన చర్చించారు. గ్రామాల్లో ఏమి జరుగుతుందో తమకే తెలియట్లేదంటూ పలువురు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనకు ఫిర్యాదు చేశారు. కాగా శీల గ్రామంలో 11మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినా వారికి ఇళ్లనిర్మాణానికి సరైన సదుపాయం లేదంటూ సర్పంచ్ కోమలి వెంకటరమణ నిలదీశారు. ఈ మేరకు బోస్ రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాతా భారతి, జడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ రేఖాడి విజయ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



కేక్ కట్ చేసి వనమాడికి తినిపిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 24: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి 36వ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, తులసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. 300మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గ్రంధి బాబ్జి, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, చింతలపూడి రవి, గుత్తుల రమణ, సత్యంశెట్టి రాజేష్, ఆకెళ్ల ప్రసాద్, భమిడిపాటి శ్రీకృష్ణ, ఉప్పులూరి వీరభద్రరావు, చాట్ల వీరబాబు పాల్గొన్నారు.

అనధికారిక కట్టడాలపై చర్యలు ఏవీ?

» వాడివేడిగా పిఠాపురం మునిసిపల్ సమావేశం

పిఠాపురం, జనవరి 24: పట్టణంలో అనధికారిక కట్టడాలు పెరిగిపోతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. పలుమార్లు ఇదే విషయంపై సమావేశంలో ప్రశ్నించినా అధికారులు స్పందించకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో బుధవారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మునిసిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వాటిని ఎందుకు నిరోధించడం లేదన్నారు. ఇప్పటి వరకూ అక్రమ కట్టడాలపై ఎంత మేర జరిమానాలు వసూలు చేశారని నిలదీశారు. టీపీవో సునీత మాట్లాడుతూ ఇప్పటివరకూ అక్రమ కట్టడాలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా విద్యుత్ స్తంభాలు కోసం అడుగుతున్నా ఇప్పటివరకూ ఇవ్వలేదన్నారు. కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘం తరపున జేసీబీ కొనుగోలు చేయాలని సూచించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి గతంలో రూ.50లక్షలు కేటాయించామని, అదనంగా మరో రూ.60లక్షలు ఇస్తామన్నారు. బీసీ, ఓసీ, మైనార్టీ భవన్‌ల నిర్మాణం నిమిత్తం నిధులు కేటాయిస్తామని తెలిపారు.

రూ.29కోట్ల మిగులుతో బడ్జెట్

2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2905.24లక్షల మిగులతో రూపొందించిన అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రారంభ నిల్వగా రూ.2975.66లక్షలను తీసుకోగా, వివిధ మార్గాల్లో పన్నులు, పన్నేతరాలు, సిబ్బంది, ఉపాధ్యాయుల జీతభత్యాలు, స్టాంపు డ్యూటీ ద్వారా రూ.4020.18 లక్షలు ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. సిబ్బంది, ఉపాధ్యాయుల జీతభత్యాలు, పించన్ల చెల్లింపులు, ప్రజారోగ్యం, కార్యాలయ నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా చార్జీలు, నిర్వహణ, అభివృద్ధి పనులకు రూ.3254.28లక్షలు వ్యయం అవుతుందని బడ్జెట్‌లో తెలిపారు. సాధారణ నిధులు నుంచి అభివృద్ధి పనులకు రూ.211.28లక్షలు కేటాయించారు.

టీడీపీలోకి వందలాది కుటుంబాల చేరిక



దొండవాకలో టీడీపీలోకి చేరిన కుటుంబాలు

తుని రూరల్, జనవరి 24: తునిలో టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి.వైసీపీని వీడి వందలాది కుటుంబాలు టీడీపీలోకి చేరుతున్నాయి. తుని మండలం దొండవాకలో దాడిశెట్టి లోవరాజు, జయరాజు, బాబ్జితోపాటు 50కుటుంబాలు రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పోల్నాటి శేషగిరిరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోత్కూరి వెంకటేష్, గంట్ల చిట్టిబాబు, గంట్ల చిన్నారావు పాల్గొన్నారు. తొండంగి మండలం ఒంటిమామిడిలో టీడీపీ సీనియర్ నాయకులు కోరుకొండ వాగు, నేమాల శ్రీనివాస్, బుద్దాల చంటి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరాయి. వీరిని యనమల కృష్ణుడు పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ నేత పదిలం రాంబాబు టీడీపీలో చేరిక



జగ్గంపేట, జనవరి 24: జగ్గంపేట మండలం ఇర్రిపాక జ్యోతుల నెహ్రూ స్వగృహంలో జగ్గంపేట మండలం భావారం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పదిలం రాంబాబు ఆయన వర్గం ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలోటీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన అంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, మహిళా నాయకులు జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో పనిచేయటానికి టీడీపీ చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కంచికృష్ణార్జున, కర్రి రంగబాబు, నాగం బుజ్జి, పదిలం బుచ్చిబాబు, పదిలం రాజన్నదొర, పడాల వెంకటేష్, పడాల లచ్చబాబు, కంటి నాగేశ్వరరావు, పదిలంనాగేశ్వరరావు, కర్రి రామకృష్ణ, నాగం సతీష్, కంచి సురేష్, పడాల చిట్టిబాబు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలంటూ కౌన్సిల్ సమావేశంవద్ద ఆందోళన

పిఠాపురం, జనవరి 24: శంకుస్థాపనలు చేసి నెలలు గడుస్తున్నా రోడ్ల పనులు చేపట్టకపోవడంపై పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ వాసులు నిరసనకు దిగారు. వారు బుధవారం పిఠాపురం మునిసిపల్ సమావేశం జరుగుతున్న పురపాలక సంఘ సమావేశ మందిరం వద్ద ఆందోళన నిర్వహించారు. 21వ వార్డుల ప్రజల గోడు ఎవ్వరు పట్టించుకోవడం లేదని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరినా స్పందించడం లేదంటూ కౌన్సిలరు కావాడి పోశయ్యతో పాటు కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు నిర్మించాలంటూ కోరేందుకు వచ్చిన జగ్గయ్యచెరువు కాలనీవాసులపై కొందరు వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారో తెలుసంటూ మండిపడ్డారు.

సభ్యులు, అధికారుల మధ్య వాగ్వివాదాలు

» ఘర్షణ వాతావరణంలో సామర్లకోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, జనవరి 24: సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్లు, అధికారుల మధ్య సమన్వయం పూర్తిగా లోపించింది. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులవద్ద సమాధానాలు లేక, సమస్యలు లేవనెత్తడమేగానీ పరిష్కారం కావట్లేదంటూ సభ్యుల అరుపులు, కేకలు, వాగ్వివాదాలతో సామర్లకోట కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.అరుణ అధ్యక్షతన సామర్లకోట కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించగా అధికార పార్టీలోని కొందరు సభ్యులు సమస్యలపై ప్రశ్నించేందుకు జీరో అవర్ కావాలని పట్టుబట్టగా అక్కర్లేదు అజెండా ఆమోదించేస్తాం అని మరికొందరు సభ్యులు అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. సమస్యలపై మాట్లాడాలంటే తన ఛాంబర్‌కు రావలసిందేనని ఛైర్‌పర్సన్ అరుణ స్పష్టం చేశారు. దీంతో పలువురు వైసీపీ సభ్యులు తీవ్రంగా నిరసించారు. కౌన్సిల్ సమావేశం అంటే నెలకొకసారి సమస్యలపై చర్చించుకునేందుకేనని సభ్యులు పట్టుబట్టారు. పితాని కృష్ణ, కరణం రాజ్‌కుమార్ ఒకవైపు, మోజెస్, పాగా సురేష్‌కుమార్ మరోవైపు పరస్పరం అరుపులు, కేకలు వేసుకున్నారు.

రూ.9.57కోట్లతో సామర్లకోట మున్సిపాల్టీ మిగులు బడ్జెట్ ఆమోదం

సామర్లకోట మున్సిపాల్టీ వార్షిక బడ్జెట్‌ను 2023-24 సంవత్సరానికిగాను అన్ని ఖర్చులు పోను రూ.9కోట్ల57లక్షల15వేల566 మిగులు బడ్జెట్‌గా కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఛైర్‌పర్సన్ జి.అరుణ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023 సంవత్సరానికిగాను రూ.11,88,92,462లను ప్రారంభ నిల్వగా చూపి రాబడి ఆదాయంగా రూ.26,70,43,084గానూ, ఖర్చులు రూ.29,02,20,000గానూ చూపి రూ.9,57,15,566గా చూపారు. దీంతో మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2024-25 సంవత్సరానికి ఇదే ప్రారంభనిల్వగా చూపారు. ఆదే ఆర్థిక సంవత్సరానికి రూ.27,06,24,988 ఆదాయంగాను, రూ.29,42,55,000 ఖర్చు కాగలదని అంచనా బడ్జెట్‌లను రూపొందించి రూ.7,20,85,555 అంచనా మిగులు బడ్జెట్‌ను సమావేశంలో ప్రతిపాదించారు. మున్సిపల్ కో-ఆప్షన్ మొదటి సభ్యుడిగా వ్యవహరిస్తున్న వైసీపీ సభ్యులు దవులూరి సుబ్బారావు రాజీనామాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు.

హాస్టల్ భవనం మరమ్మతులు చేయించాలని వినతి

కాకినాడ సిటీ, జనవరి 24: కాకినాడ బాలాజీచెరువు సమీపంలోని అంబేడ్కర్ హాస్టల్ భవనం మరమ్మతులు చేయించాలని జిల్లా దళిత నాయకులు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి, అనేకమంది మేధావులు విద్యాభ్యాసం సమయంలో బస చేసి చరిత్ర ఈ హాస్టల్‌కు ఉందన్నారు. ఇటీవలి కాలంలో ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి హాస్టల్ దుస్థితిని వివరించగా వారి గ్రాంటు ద్వారా కొంత నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం భవనం స్లాబ్ లెవెల్ పనులు జరుగుతున్నాయన్నారు .గతంలో ఈ భవనంలో జీఎంసీ బలాయోగి పేరు మీద బ్లాక్ నిర్మించారన్నారు. ఈ బ్లాక్‌లోని భవనం ప్రస్తుతం మరుగుదొడ్లు లేక, మరమ్మతులు చేయక నిరుపయోగంగా ఉందన్నారు. భవప మరమ్మతులు, మరుగుదొడ్లు నిర్మించి త్వరలో హాస్టల్ విద్యార్థులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ),జనవరి 24: సామర్లకోట కెనాల్ నుంచి శశికాంత్‌నగర్ ట్రీట్‌మెంట్‌ప్లాంటుకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కమిషనర్ నాగనరసింహారావు ఆదేశాలు జారీచేశారు. అచ్చింపేట సమీపంలోని ఉండూరువద్ద పైప్‌లైన్ ధ్వంసం కావడంతో కొన్నిప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం నేపథ్యంలో కమిషనర్ అధికారులతో కలిసి బుధవారం మరమ్మతు పనుల్ని పరిశీలించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 24: జాతీయ ఓటర్ల దినోత్సవంసందర్భంగా ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందాలి.. వినియోగించుకోవాలి అనే నినాదంతో ఈనెల 25న నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించి తర్వాత సమావేశం నిర్వహిస్తున్నట్లు సిటీ నియోజకవర్గం ఈఆర్వో మున్సిపల్ కమిషనర్ నాగనరసింహారావు తెలిపారు. ర్యాలీ ఏర్పాట్లపై ఏఈ ఆర్వోలు, మున్సిపల్ అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు.

ముస్లిం పోరాట సమితి ఉపాధ్యక్షుడిగా బషీరుద్దీన్

ప్రత్తిపాడు, జనవరి 24: ఆల్ ఇండియా ముస్లిం పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా కన్వీనర్‌గా ప్రత్తిపాడుకు చెందిన ఎండీ బషీరుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జియాఉద్దీన్ బుధవారం ఆదేశాలిచ్చారు.ఆయన్ను పలువురు అభినందించారు.

సర్వే పనుల పరిశీలన

కరప, జనవరి 24: గురజనాపల్లిలో సాల్ట్ భూముల్లో ఏర్పాటు చేయబోయే జగనన్న కాలనీలో చదును చేసి మక్కురాళ్లు వేసే పనులను తహసీల్దార్ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఆర్ఐ మాచరావు, సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

'రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం'

కరప, జనవరి 24: పెద్దాపురప్పాడులో ఎమ్మెల్యే కన్నబాబు గడపగడపకు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలు, రైతుల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. జడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, ఉపసర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల పరామర్శ

తాళ్లరేవు, జనవరి 24: నీలపల్లిలో అనారోగ్యంతో సోదరుడుమృతిచెందిన బాధలో ఉన్న టీడీపీ నాయకుడు పిల్లి సత్తిబాబును, పెదగోవలంకలో ప్రమాదవశాత్తూ గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ నేత కాటు విశ్వేశ్వరరావు(పండు)ను పలువురు పార్టీ నేతలు బుధవారం పరామర్శించారు. ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, దున్నా సుబ్రహ్మణ్యం, మురళి, గంజా సూరిబాబు, సాదనాల కాళీ, పితాని విష్ణు పాల్గొన్నారు.

'ఇళ్లస్థలాలు స్థానికంగా ఇవ్వాలి'

తాళ్లరేవు, జనవరి 24: మండలంలోని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను స్థానికంగా నివాసం ఉంటున్న ఆవాస ప్రాంతాల్లోనే కేటాయించాలని ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చొల్లంగిలో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు జి.వేమవరం, పటవల, తాళ్లరేవులో ఇళ్ల స్థలాలు ఇవ్వడం అన్యాయమన్నారు.

మల్లంపేట ఉపసర్పంచ్‌గా రాయపురెడ్డి

రౌతులపూడి, జనవరి 24: మల్లంపేట ఉప సర్పంచ్‌గా రాయపురెడ్డి కన్నబాబు ఎన్నికయ్యారు. వార్డు సభ్యులంతా కలిసి కన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకూ రాయపురెడ్డి సన్యాసిదేవుడు ఉపసర్పంచ్‌గా చేయగా రెండున్నరేళ్ల ఒప్పందంలో భాగంగా కన్నబాబును ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఎంపీడీవో గోవింద్, సర్పంచ్ పోలుపర్తి తాతాజీ అభినందించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

జాతీయ బాలికా దినోత్సవం

గొల్లప్రోలు, జనవరి 24: గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీవో నిహారిక, ఎంఈవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తుని రూరల్, జనవరి 24: జాతీయ బాలికల దినోత్సవాన్ని కేజీబీవీ తొండంగి, తుని మండలం వి.కొత్తూరులో అట్టహాసంగా నిర్వహించారు.

పిఠాపురం, జనవరి 24: పిఠాపురం పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. సీడీపీవో ఎం.నీహారిక, చైల్డ్‌లైన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్, జనవరి 24: తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ జాతీయ సేవా సమితి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ అంధుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసర సరుకులు ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ అందించారు. ఈ సందర్భంగా కేక్ కోసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం. శ్రీదేవి, డాక్టర్ కె. హరిబాబు, రాధామాధవి, లలిత, కుమారి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి, జనవరి 24: బాలికలు చదువుతోపాటు వివిధ క్రీడల్లో ప్రావీణ్యత సాధించాలని ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు విజ్ఞప్తి చేశారు. వాకతిప్ప జడ్పీ ఉన్నతపాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాలికలకు నిర్వహించిన వక్తృత్వ చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఎంఈవోలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో నిహారిక, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంత లక్ష్మి పాల్గొన్నారు.



అంధుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం